అరకొరగా జీలుగ విత్తనాలు పంపిణీ

- విత్తనాల కోసం ఎగబడిన రైతులు

హత్నూరలో జీలుగ విత్తనాల కోసం గుమిగూడిన రైతులు

హత్నూర, మే 24: వానకాలం సీజన్ సమీపిస్తుండడంతో దుక్కులు దున్నిన రైతులు జీలుగ విత్తనాల కోసం కొద్దిరోజులుగా ఎదురుచూస్తున్నారు. శుక్రవారం హత్నూర మండలానికి జీలుగ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. వ్యవసాయ శాఖ అధికారులు శనివారం హత్నూర, దౌల్తాబాద్, చింతల్‌చెరు గ్రామాల్లో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. జీలుగ విత్తనాలు మండలానికి వచ్చాయని తెలుసుకున్న రైతులు శనివారం ఉదయమే ఆయా కేంద్రాల వద్దకు బారులుతీరారు. పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకొని క్యూలో నిల్చున్నారు. మండలానికి రైతులకు సరిపోను జీలుగ విత్తనాలు రాకపోవడంతో ముందస్తుగా అధికారులు క్యూ ఏర్పాటుచేసి విత్తనాలు పంపిణీచేశారు. విత్తనాల కోసం వచ్చిన రైతులు గంటలతరబడి క్యూలో నిల్చున్నా జీలుగ విత్తనాలు కొందరు రైతులకు లభించలేదు. మరో వారం రోజుల్లో మరిన్ని జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తామని అధికారులు తెలుపడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. హత్నూరకు 100క్వింటాళ్లు, దౌల్తాబాద్‌కు 100క్వింటాళ్లు, చింతల్‌చెరుకు 50క్వింటాళ్లు జీలుగ విత్తనాలు రాగా, 30 కిలోల బ్యాగును రూ.2137 చొప్పున విక్రయించినట్లు ఏవో శ్రీనివాస్‌రావు తెలిపారు. మండలానికి 60క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మళ్లీ పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

జీలుగ విత్తనాలను అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, మే 24: రైతులకు 50శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం గుమ్మడిదలలో పీఏసీఎస్ కార్యాలయంలో జీలుగు విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో లక్ష్మణ్‌నాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, నర్సింగ్‌రావు, తులసీదాస్ పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ

రామచంద్రాపురం,మే 24: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామ రైతువేదికలో శనివారం పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ప్రసాద్, విస్తరణ అధికారి రాణి, సహాయ సంచాలకులు మనోహర్, సొసైటీ డైరెక్టర్లు రాజ్‌కుమార్, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా జీలుగ విత్తనాలు

అందోల్, మే 24: మండలంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం నంబర్-2, పీఏసీఎస్ అందోల్‌లో 50శాతం సబ్సిడీపై ఈనెల 26 నుంచి జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీహరి శనివారం ప్రకటనలో తెలిపారు. మండలానికి 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని, రైతులు నేటి నుంచి జోగిపేట వ్యవసాయ కార్యాలయంలో పర్మిట్లు రాయించుకోవాలన్నారు.

అర్చకుడిపై దాడి గర్హనీయం

అందోల్, మే 24: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరలో అర్చకుడు సంజీవ్ పూజారిపై రామారావు అనే వ్యక్తి దాడిచేయడం గర్హనీయమని బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ దేశ్‌పాండే, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాజశేఖర్ కులకర్ణి అన్నారు. శనివారం జోగిపేటలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలతో పవిత్ర పుణ్యక్షేత్రానికి చెడ్డపేరు వస్తున్నదని, ఈ దాడిని హిందూ ధర్మంపై జరిగిన దాడిగా పరిగణించాల్సి వస్తుందన్నారు. పోలీసులు సైతం దాడి చేసిన వారికి వత్తాసు పలుకుతూ బాధితుడైన పూజారిపైనే కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం, దేవదాయ శాఖ ఈ విషయంలో స్పందించి అక్రమ కేసు నమోదు చేసిన పోలీసులపై, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు శిరీష అశోక్, బ్రాహ్మణ సంఘం నాయకులు శ్యాంరావు, రవిశంకర్, వాసుదేవరావు, సురేశ్‌జోషి, వసంత్ పటేల్, మారుతీరావు, నరసింహారావు, పాండురంగారావు, రజినీరమేశ్, జ్యోతిచంద్రిక, వనజవామన్ పాల్గొన్నారు.

108వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

నల్లవల్లిలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మే 24: ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతు జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతున్నది. శనివారం గుమ్మడిదల మండలంలోని నల్లవల్లిలో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు సంయుక్తంగా కలిసి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్ష 108వ రోజుకు చేరుకున్నది. దీక్షలో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం

తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జిన్నారం, మే 24: జిన్నారం తహసీల్దార్ దేవదాస్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర మాదిగ ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ... భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దారును విజ్ఞప్తి చేశారు. రైతు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తహసీల్దారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, నాయకులు నవీన్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మెట్టుకుమార్

పటాన్‌చెరు, మే 24: వానకాలంలో దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వానకాలంలో ప్రజలకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ శాఖ ద్వారా దోమల మందు పిచికారీ (ఫాగింగ్) చేయిస్తున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలోని ప్రతి కాలనీలో దోమల నివారణకు మందు పిచికారి చేయాలని ఎంటమాలజీ సిబ్బందిని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ తిరుపతి, సూపర్‌వైజర్ నాగార్జునరెడ్డి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎఫ్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జర్నలిస్టు నాయకులు

సంగారెడ్డి, మే 24: తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను శుక్రవారం సాయంత్రం సంగారెడ్డిలో తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథిగృహంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 31న హైదరాబాద్‌లో రజతోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. టీజేఎఫ్ రజతోత్సవ సభకు తెలంగాణ ఉద్యమ నేతలు, ఉద్యమకారులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు హాజరుకానున్నట్లు చెప్పారు. టీజేఎఫ్ రజతోత్సవ సభకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని జర్నలిస్టులంతా పెద్ద సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నాయకులు శ్రీధర్, పరశురాం, యోగానందరెడ్డి, సునీల్, శ్రీనివాస్, రాము, నాని పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

అమీన్‌పూర్, మే 24: అమీన్‌పూర్ నుండి చందానగర్ వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ప్రయాణం సుఖవంతం చేయాలని అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీపుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం వేలాది వాహనాలు అమీన్‌పూర్ ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తాయని, రోడ్డు గుంతలపడి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరై పనులు నత్త నడకన కొనసాగుతున్నాయని, వర్షాకాలం సమీపిస్తున్నందున తాత్కాలికంగా గుంతలు మరమ్మతులు ఇబ్బందులు తొలిగించాలని మంత్రి పీఏకు వినతిపత్రం అందజేశారు.

ఖానాపూర్‌లో వైభవంగా బోనాలు

ఖానాపూర్‌లో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోహీర్, మే 24: మండలంలోని ఖానాపూర్‌లో మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం వేడుకలను పురస్కరించుకొని పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు అలరించింది. అందంగా అలంకరించిన బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో భాగంగా ఆలయంలో ప్రతిష్ఠించిన మేడాలమ్మ, క్యాతమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఉత్సవాల్లో మాజీ ఎంపీపీ అనితానర్సింహులు, మాజీ సర్పంచులు రాములు, రాములమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్, రాచన్న, నర్సింహులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొని ఒకరి మృతి

పటాన్‌చెరు రూరల్, మే 24: ఆటోను వెనుక నుండి ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాటి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... తాడేల సుదీత్ కుమార్ (26), నారాయణఖేడ్ వెంకటాపూర్‌కు చెందిన దొడ్ల ఆనంద్(23) స్నేహితులు. వీరు కార్వాన్, మెహిదీపట్నంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఇద్దరు కలిసి బోరంచ జాతరకు స్కూటీపై బయలుదేరారు. పాటి శివారులోని గాడియన్ స్కూల్ దాటగానే సర్వీస్ రోడ్డులో ముందు వెళ్తున్న ఆటోను ఆనంద్ నడిపిస్తూ వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో సుదీత్ కుమార్ భుజానికి గాయమవ్వగా, ఆనంద్ కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్నేహితుడి పరిస్థితిని గమనించి అంబులెన్స్‌లో పటాన్‌చెరు దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆనంద్ మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్

అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రామచంద్రాపురం, మే 24: అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో ఉన్న ఇండస్‌క్రస్ట్ అపార్ట్‌మెంట్‌లో పటాన్‌చెరు అగ్నిమాపక అధికారి నాగరాజు నేతృత్వంలో సిబ్బంది అగ్ని ప్రమాదాలకు సంబంధించి మాక్‌డ్రిల్ చేసి అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పించారు. అపార్ట్‌మెంట్స్‌లో ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండాల్సిన తీరుని మాక్ డ్రిల్‌లో చూపించారు. ఈ సందర్భంగా టీనా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్ చేసి ప్రజలకు అవగాహన కల్పించడం మంచి విషయమన్నారు. పటాన్‌చెరు అగ్నిమాపక అధికారులు ఇదే విధంగా అన్ని గేటెడ్ కమ్యూనిటీస్‌లో మాక్ డ్రిల్‌లను నిర్వహించేందుకు చొరవ చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఇండస్‌క్రస్ట్ అపార్ట్‌మెంట్స్ కార్యదర్శి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. రాకపోకలకు తిప్పలు

లచ్చునాయక్ తండా వద్ద రోడ్డుపై గుంతలు.. నిలిచిన వర్షపు నీరు

సిర్గాపూర్, మే 24: మండలంలోని వాసర్ కిషన్‌నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని లచ్చునాయక్ తండా వద్ద రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. చినుకు పడితే రోడ్డంతా చిత్తడిగా మారుతున్నది. గుంతల్లో వర్షపు నీరు నిలుస్తున్నది. ఎన్కెమురి చౌరస్తా వరకు ఈ రోడ్డుపై గుంతలు వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నెలరోజుల క్రితం ఈ రోడ్డుపై ఆర్ అండ్ బీ శాఖ మొక్కుబడిగా గుంతలు పూడ్చగా, మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డుపై నారాయణఖేడ్ నుంచి వాసర్ మీదుగా కంగ్టి ఇతరత్రా ప్రాంతాలకు వెళ్తుంటాయి. లచ్చునాయక్ తండాకు రాగానే ప్రయాణం నరకాన్ని తలపిస్తున్నదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని వారు కోరుతున్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

మాడ్గి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు, వ్యవసాయాధికారులు

జహీరాబాద్, మే 24: బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఇతర రాష్ట్రాల నుంచి పశువులను రాష్ట్రంలోకి అక్రమంగా తరలించకుండా అడ్డుకునేందుకు జహీరాబాద్ నియోజకవర్గంలోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని మాడ్గి, న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ చౌరస్తాలో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జహీరాబాద్ డీఎస్పీ సైదా ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలు శివలింగం, హనుమంతు పర్యవేక్షణలో పశువైద్యాధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి ఆయా చెక్‌పోస్టుల వద్ద మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి తెలంగాణలోకి వచ్చే పశువులతో వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మొగుడంపల్లి మండలంలోని చిరాగ్‌పల్లి, న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ ఎస్సైలు రాజేందర్‌రెడ్డి, చల్లా రాజశేఖర్ మాట్లాడుతూ.. పోలీస్ చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేస్తున్నామన్నారు. పోలీసు, పశువైద్యాధికారులు సమన్వయంతో పనిచేసి పశువుల అక్రమ రవాణాను అడ్డుకుంటామని తెలిపారు. ఆయా రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోని పశువుల రవాణాకు కావాల్సిన రవాణా పత్రాలు పరిశీలించి, అనుమతిలేని వాటిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పశువులు ఒకచోటి నుంచి మరోచోటకు తరలిస్తే పశువైద్యాధికారుల అనుమతి పత్రం తప్పనిసరి తీసుకోవాలని సూచించారు. జహీరాబాద్, పట్టణ రూరల్ సర్కిల్ పరిధిలో జహీరాబాద్, చిరాగ్‌పల్లి హద్నూర్, రాయికోడ్, ఝరాసంగం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్‌లతో పాటు ఆయా మండలాలకు చెందిన పశువైద్యాధికారులు ఈ చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి ముంబై-హైదరాబాద్, బీదర్-జహీరాబాద్ రోడ్డు మార్గాల గుండా రాష్ట్రంలోకి ప్రవేశించే వాహనాలను నిత్యం తనిఖీలు చేసి, పశువుల తరలింపును అడ్డుకుంటామన్నారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

కంది మండలం కౌలంపేట్ గ్రామ ఊదం చెరువులో నల్లమట్టి కోసం జరిపిన తవ్వకాలు

- ప్రొక్లెయినర్లతో చెరువును తవ్వుతున్న అక్రమార్కులు
- నల్లమట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం
- మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలి: గ్రామస్తులు

కంది, మే 24: మండలంలోని కౌలంపేట్ ఊదం చెరువు నుంచి నల్లమట్టి అక్రమ రవాణా చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఊదం చెరువులోని నల్లమట్టిని అక్రమార్కులు అర్ధరాత్రిళ్లు తరలించుకు పోతున్నారు. చెరువులో సుమారు ఎకరానికి పైగా జేసీబీలతో మట్టిని తరలించడంతో చెరువంతా గుంతలమయంగా మారింది. అధికార పార్టీ నేతల అండదండలతోనే నల్లమట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారి ఆరులైన్లుగా విస్తరిస్తుండడంతో మొరం మట్టి కోసం నేషనల్ హైవే అథారిటీ అధికారులు అన్ని అనుమతులతో ఊదం చెరువులోని మొరం మట్టిని వాడుకుంటున్నారు. ఇదే అనువుగా భావించిన కొందరూ అక్రమార్కులు చెరువులోని నల్లమట్టిని తరలిస్తున్నారు. రహదారి పనుల కోసం జరుపుతున్న తవ్వకాల వెనకాలే అక్రమార్కులు అర్ధరాత్రి సమయంలో జేసీబీలతో నల్లమట్టిని టిప్పర్లలో తరలించుకుపోతున్నారు. తాము అధికార పార్టీకి చెందినవారిమి, తమను అడ్డుకునేదెవరనే ధీమాలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. సంబంధిత అధికారులు ఊదం చెరువుపై ప్రత్యేక దృష్టి పెట్టి మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమార్కుల నల్లమట్టి తరలింపునకు సహకరించకపోవడంతో నేషనల్ హైవే అథారిటీ అధికారిపై దాడికి పాల్పడినట్లు తెలుస్తుంది. ఈ విషయాన్ని బయటకు రాకుండా ఓ నాయకుడు జోక్యం చేసుకొని దాడికి పాల్పడిన వారితో క్షమాపణ చెప్పించి కాంప్రమైజ్ చేపించినట్లు తెలిసింది.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

కౌలంపేట్ ఊదం చెరువులో అక్రమంగా నల్లమట్టిని తరలిస్తున్నట్లు దృష్టికి వచ్చింది. వారిపై చర్యలు తీసుకునేలా సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. చెరువుల్లో మట్టిని తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– ఆశాజ్యోతి, కంది తహసీల్దార్

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

వట్‌పల్లి: శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో డీఈవో వెంకటేశ్వర్లు

వట్‌పల్లి, మే 24: ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారులు పాల్గొని శిక్షణలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానించి, అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షను అలవాటు చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులలో విద్యార్థులకు అందించే వసతులను తెలియజేయాలన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాల కొరకు ఎంచుకున్న ప్రైవేటు శ్రీవాణి జూనియర్ కళాశాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలలను సందర్శించి పాఠశాల యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఎంవో వెంకటేశం, లింబాజీ, ఎంఈవో గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

సిర్గాపూర్, మే 24: పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మక, నిర్మాణాత్మక విద్యనందించాలని ఎంఈవో నాగారం శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక కస్తూర్బాలో జరిగిన ఉపాధ్యాయుల వృత్యాంతర శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదురోజుల్లో నేర్చుకున్న అంశాలపై ఎంఈవో ఉపాధ్యాయుల అభిప్రాయాలను సేకరించారు. ఎన్నో వినూత్న అంశాలు, ఈ శిక్షణలో నేర్చుకున్నామని, జూన్ ప్రారంభం నుంచే స్కూల్‌కు వెళ్లి పిల్లల నమోదు సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని టీచర్లు తెలిపారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.

మెరుగైన బోధన చేయాలి

నాగల్‌గిద్ద, మే 24: మెరుగైన బోధన చేసి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించి ప్రభుత్వ బడుల్లో వారి సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో మన్మథ కిశోర్ సూచించారు. ఇంగ్లిష్, ఈవీఎస్ సబ్జెక్టులకు పూర్తిగా ఇంగ్లిష్‌లోనే బోధించి, విద్యార్థులు ఆ భాషపై మరింత పట్టు సాధించేలా చూడాలన్నారు. టీచర్లకు నాలుగు రోజులు కొనసాగిన శిక్షణ శనివారం ముగిసింది. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు.

కృత్యాధార విద్యా బోధన చేయాలి

జిన్నారం, మే 24: కృత్యాధార విద్యాబోధన చేయాలని, వృత్తి నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి ఉపాధ్యాయులకు సూచించారు. చెట్లపోతారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదు రోజులుగా కొనసాగిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమానికి బొల్లారం సీఐ రవీందర్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్పీలు ఉమాదేవి, ఝాన్సీరాణి, కవిత, బాలనర్సింహ్మారెడ్డి, పద్మావతి, రవికుమార్, నరేందర్‌బాబు, అంజయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

సదాశివపేట, మే 24: పట్టణంలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో గత ఐదు రోజులుగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈవో శంకర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని గుణాత్మక, నిర్మాణాత్మక విద్యను విద్యార్థులకు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శంకర్, ఎంఆర్పీలు యూసుఫ్, మల్లేశం, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

కోహీర్, మే 24: మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి ఆయా గ్రామాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన నైపుణ్య శిక్షణ శనివారంతో ముగిసింది. నాలుగు రోజుల పాటు శిక్షణలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఆర్పీలు సూచించారు. శిక్షణ ముగింపు సందర్భంగా డీఆర్పీ వల్లభ్‌జోషి దిగ్వాల్ పాఠశాలను సందర్శించి. వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కుతుబొద్దీన్

జహీరాబాద్, మే 24: న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ కుతుబొద్దీన్ పేదింటి పెండ్లి కూతురుకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన బేగరి లక్ష్మి-దేవేందర్ దంపతుల కూతురు తేజశ్రీ వివాహం మండలంలోని ఆత్నూర్‌కు చెందిన రమేశ్‌తో శుక్రవారం జరిగింది. మాజీ సర్పంచ్ గ్రామస్తులతో కలిసి తేజశ్రీ వివాహానికి హాజరై ఆర్థిక సాయం అందజేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. నాయకులు సయ్యద్ నజీర్, మహ్మద్ ఖదీర్, అమ్రోజ్, షేక్ మోహీజ్, గౌని నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈ చిన్నారి ఎవరో

తల్లిదండ్రుల కోసం ఎదురు చూస్తున్న చిన్నారి

కోహీర్, మే 24: మండలంలోని దిగ్వాల్ గ్రామ శివారులో ఓ చిన్నారి ఒంటరిగా ఉండడంతో పోలీసులకు విషయం తెలిసింది. ఎస్సై సతీశ్‌వర్మ వివరాల ప్రకారం.. శనివారం దిగ్వాల్ గ్రామ శివారులో 11 ఏండ్ల వయసున్న అమ్మాయి నల్లటి ప్యాం టు, టీషర్టు ధరించి ఒంటరిగా ఏండగా స్థానికులు గుర్తించారు. ఆ అమ్మాయిని వివరాలు అడిగితే సరిగా చెప్పడం లేదు. కన్నడ మాత్రమే మాట్లాడుతున్నది. ఎవరికైనా ఈ అమ్మాయి వివరాలు తెలిస్తే కోహీర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

మారిన విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లు

సదాశివపేట, మే 24: సదాశివపేట మండల విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లు మారినట్లు పట్టణ ఏఈ మధుసూదన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఏడీఈ సదాశివపేట 87124 73147, పట్టణ ఏఈ 87124 73153, రూరల్ ఏఈ 87124 73154, ఏఈ కొండాపూర్ 87124 73155, ఏఈ మునిపల్లి 87124 73156, సదాశివపేట టౌన్ సబ్‌స్టేషన్ 87124 73178 నెంబర్లను కేటాయించారని తెలిపారు.

జిన్నారంలో...

జిన్నారం, మే 24: బొల్లారం మున్సిపల్ పరిధిలోని విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లు మారాయని విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణారెడ్డి, ఏడీఈ మాధవరావు శనివారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఏఈ బొల్లారం 8712473238, ఏడీఈ బొల్లారం 8712473233, బొల్లారం (ఎస్ఎస్ -1) 8712473255, బొల్లారం (ఎస్ఎస్ -2) 8712473254, బొల్లారం (ఎస్ఎస్ -3) 8712473256, బొల్లారం (ఎస్ఎస్ -4) 8712473273 బొల్లారం సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు మారిన ఫోన్ నెంబర్లను గమనించాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి కొత్త నంబర్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

నారాయణఖేడ్, మే 24: 2025-26 సంవత్సరానికి నారాయణఖేడ్ జోన్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జోన్ చైర్మన్‌గా బి.రాజ్‌కుమార్, అధ్యక్షుడిగా బావుగి సాయి సంగమేశ్వర్, కార్యదర్శిగా బల్లెపు మల్లేశ్, కోశాధికారిగా పోతన్నోల నరసింహారెడ్డి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు, స్థానిక లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

జహీరాబాద్, మే 24: న్యాల్‌కల్ మండలంలోని బసంత్‌పూర్ శివారులో రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ సంపత్(45) ఇంట్లో గొడవపడి మనస్తాపానికి గురై గ్రామ శివారులోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లాడు. రాత్రిపూట ఆ మార్గం గుండా వెళ్తున్న రైలుకు అడ్డంగా వెళ్లడంతో ఢీకొట్టడంతో తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

PUBLIC NOTICE

General Public are hereby informed that our Client had entered into Agreement of Sale with M/s. AVK INFRA DEVELOPERS LLP, (LLP identification No.ACF-0610) Regd Off at P.Nos. 1383, 1396/P, Raja Rajeswara Nagar, Kondapur, Serilingampally, Hyd-bad-500084, Rep by its Designated Partner Mr. Annangi Vinod Kumar s/o Sri A.Venkata Subbaiah to purchase the house plots bearing No. 56 & 57, ad 150 sq.yds each (2 plots @ 150 + 150 sq.yds, Total 300 sq.yds), in venture "RRR WEST FIELDS" in Survey No. 483/P, 484/P, 485/P & 512/P of Gollagudem (G.P), Nandi Kandi Revenue Village, Sadasivpet Mandal, Sangareddy Dist, TG, (covered under the DTCP Open Plot Layout-TLP No. 102/2024/H), bounded by N: P.No. 57, S: P.No. 55, E: P.No. 71, W: 40' Wide Rd (for P.No. 56) and by N: P.No. 58, S: P.No. 56, E: P.No. 70, W: 40' Wide Rd (for P.No. 57) and paid considerable amount towards advance / part / full sale consideration. If any person(s) has any objection / charge / lien / claim / interest in respect of the said property, shall approach the undersigned office within SEVEN (7) days from the date of this publication with all relevant original documents failing which our client shall proceed with the registration. Thereafter, no claim shall be entertained.

P.PANDU RANGANATH & P.SRIDEVI, ADVOCATES
15-16/6, MIRZALGUDA, MALKAJGIRI, HYDERABAD-500047, Mobile: 9849103457.